

బహదూరపు బాటసారి

పాలమూరు గొర్రెల కాపరులు ఏడాదిలో 8 నెలల పాటు జీవాల పెంపకంలో భాగం తిరుగుతూనే ఉంటారు. 10లో



కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

కాంగ్రెస్ పాలనలోనే మారుమూల గ్రామాలు అన్ని విధాల అభివృద్ధి చెందాయని పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి తెలిపారు. 10లో



కమ్ముకొస్తున్న మబ్బులు

మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉండటంతో కర్షకులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. 11లో

న్యూస్‌రీల్

పాలిసెట్ ఫీజు గడువు పొడిగింపు

అనంతగిరి: పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగించినట్లు పాలిసెట్ జిల్లా కన్వీనర్ పరమేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌కు యువతే కొండంత అండ

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: కాంగ్రెస్ పార్టీకి యువతే కొండంత అండ అని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చెన్నారం శివారులో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ మండల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో యాలాల మండలం నుంచి మంచి మెజార్టీ రావడానికి యువతే కీలకమని కొనియాడారు. పార్టీ కోసం పని చేసే ప్రతి యువజన కాంగ్రెస్ నాయకులకు భవిష్యత్తులో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత యువతపై ఉందన్నారు. ఇందిరమ్మ రాజ్యమే తమ లక్ష్యమని తెలిపారు. అనంతరం ఎంపీ ఎన్నికల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి జీషాన్ అహ్మద్, చేవెళ్ల పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కృష్ణంరాజు, అసెంబ్లీ ఇన్‌చార్జ్ సంతోష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బస్వరాజ్, మాజీ అధ్యక్షుడు గాజుల మన్నాన్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, మాజీ అధ్యక్షుడు భీమప్ప, నాయకులు హన్మంతు, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



వాకర్స్‌తో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతగిరి: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం వికారాబాద్‌లోని ఎస్ఏపీ కళాశాల మైదానంలో వాకర్స్‌తో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి గురించి వారికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యావత్ ప్రపంచం మోదీ వైపు చూస్తోందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మూడో సారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఎక్కడికి వెళ్లిన ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. అనంతరం గిరిగేట్‌పల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు కేపీ రాజు, శ్రీనివాస్ రెడ్డి, వడ్ల నందు, వాకర్స్ పాల్గొన్నారు.

నామినేషన్లకు నేడే ఆఖరు

రాజేంద్రనగర్‌లో నేడు సీఎం రేవంత్ రోడ్‌షో

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ స్థానాలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం నేటితో ముగియనుంది. రాజేంద్రనగర్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో గురువారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఆఖరి రోజు కావడంతో ఇప్పటికే ఒకటి, రెండు సెట్లు దాఖలు చేసిన అభ్యర్థులు మిగిలిన సెట్లను కూడా దాఖలు చేసే అవకాశం ఉంది. బుధవారం చేవెళ్ల లోక్‌సభ స్థానానికి 18 మంది అభ్యర్థులు 20 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి శశాంక వెల్లడించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం అత్తాపూర్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి తుది నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి సహా ఇతర ప్రముఖులు హాజరు కానుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అత్తాపూర్ పిల్లర్ నంబర్ 154 నుంచి రాజేంద్రనగర్ అంబేడ్కర్ విగ్రహం వరకు మధ్యాహ్నం వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించనున్నారు. రేవంత్‌రెడ్డి హాజరవుతున్న ఈ రోడ్‌షోకు చేవేళ్ల, రాజేంద్రనగర్, శేర్‌లింగంపల్లి, వికారాబాద్, మహేశ్వరం, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులను పెద్ద సంఖ్యలో తరలించేందుకు నేతలు సన్నాహాలు చేస్తున్నారు.

మళ్లీ వెనుకబాటే..

- ఇంటర్ ఫలితాల్లో దాదాపు చివరి స్థానంలో జిల్లా
- గత ఏడాదితో పోలిస్తే కాస్త మెరుగు
- ఫస్ట్ ఇయర్‌లో 61 శాతం ఉత్తీర్ణత
- సెకండ్ ఇయర్‌లో 69 శాతం..

వికారాబాద్: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో జిల్లా దాదాపు చివరి స్థానంలో నిలిచింది. బుధవారం రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో మనం ఫస్ట్, సెకండ్ ఇయర్‌లోనూ వెనుకంజలోనే నిలిచాం. గత ఏడాదితో పోలిస్తే ఫస్ట్ ఇయర్‌లో మాత్రం కాస్త పర్వాలేదు అనిపించారు. జిల్లాల వారీగా చూస్తే మనం మొదటి సంవత్సరంలో 22వ స్థానంలో, రెండో సంవత్సరం 27వ స్థానంలో నిలవడం మన పరిస్థితికి అద్దం పడుతోంది. బాలికలు పైచేయి సాధించారు. మొదటి సంవత్సరంలో 6,455 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3,428 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండ్ ఇయర్‌లో 6,456 మంది పరీక్షలకు హాజరుకాగా 3,965మంది పాసయ్యారు. వొకేషనల్ ఇంటర్ రెండో సంవత్సరంలో 1,242 మంది పరీక్షలకు హాజరు కాగా 839 మంది ఉత్తీర్ణత సాధించారు.



అరుంధతి (ఎంపీసీ 991), మోడల్ స్కూల్, ఎన్కేపల్లి



అక్షయ (ఎంపీసీ 988), గురుకులం, అనంతగిరి



అనూష (ఎంపీసీ 988) కేజీబీవీ, కొడంగల్



ఇందు (బైపీసీ 983), టీఎస్ గురుకులం, తాండూరు



జాహ్నవి (బైపీసీ 982), గురుకులం, అనంతగిరి



అశ్విత (బైపీసీ 982), గురుకులం, అనంతగిరి

పర్యవేక్షణ లోపం

ఇంటర్ ఫలితాల్లో జిల్లా వెనుకబడటానికి అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. నోడల్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉండటం కూడా ప్రభావం చూపింది. వికారాబాద్ కళాశాల ప్రిన్సిపాల్‌కు నోడల్ ఆఫీసర్ బాధ్యతలు అప్పగించారు. ఆయన ఒక్కరోజు కూడా ఇతర కళాశాలలను సందర్శించిన పాపాన పోలేదు. ఇంటర్ బోర్డు అధికారులైతే ఏడాదికోసారి కూడా ఇటు వైపు చూడలేదు. ఈ కారణంగానే ఫలితాలపై ప్రభావం పడిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ఆందోళన వద్దు

- ఫెయిల్ అయిన విద్యార్థులు మళ్లీ పరీక్ష రాసి పాస్ కావచ్చు
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్



అనంతగిరి: పరీక్ష ఫలితాలపై విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, మళ్లీ పరీక్ష రాసి పాస్ కావచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పల్వన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఒక వేళ పరీక్ష తప్పితే ఒత్తిడి, అభద్రతకు గురికారాదని, ఆత్మహత్య లాంటి తొందర పాటి నిర్ణయాలు తీసుకోరాదని సూచించారు. సప్లిమెంటరీ పరీక్షలు రాసి ఉత్తీర్ణత అయి పైచదువులకు వెళ్లవచ్చని తెలిపారు. ఎంతో మంది మేధావులు ప్రాథమిక స్థాయిలో ఫెయిల్ అయినా అధైర్య పడకుండా కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు. జీవితం చాలా విలువైనదని, మీపై ఎన్నో ఆశలతో కంటికి రెప్పలా చూసుకునే తల్లిదండ్రులకు శోకాన్ని మిగల్చరాదని సూచించారు. జీవితం అంటే పరీక్షలు మాత్రమే కాదన్నారు. పరీక్ష ఫలితాలపై విద్యార్థులు ఒత్తిడికి లోనైతే వారిలో మానసిక స్థైర్యాన్ని నింపడానికి జిల్లా మానసిక ఆరోగ్య కేంద్రం టోల్ ఫ్రీ నంబర్ 14416కు కాల్ చేసి సంప్రదించాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల మార్కులను కొలమానంగా చూడరాదని, యువకులకు ఎన్నో రంగాల్లో అవకాశాలు ఉంటాయని, పిల్లలను ఇతర విద్యార్థులతో పోల్చవద్దని సూచించారు. పిల్లలు మానసిక ఒత్తిడికి గురి అవుతున్నట్లు తెలిస్తే వెంటనే కౌన్సెలింగ్ ఇప్పించాలని తెలిపారు. మానసిక ఒత్తిడికి గురి కాకుండా ఉండాలంటే సరైన నిద్ర, మంచి ఆహారపు అలవాట్లు, క్రమం తప్పకుండ వ్యాయామం, సోషల్ మీడియాను తక్కువగా వాడటం, స్నేహితులతో గడపడం వంటివి చేయాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

జిల్లా అధికారులకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచన

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని, ఇందుకోసం ప్రణాళికాబద్ధంగా సాగాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. బుధవారం జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నామినేషన్ల ప్రక్రియ ముగుస్తున్నందున స్క్రూట్నీ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, హోం ఓటింగ్, ఓటర్ స్లిప్పుల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో సమావేశమయ్యారు. వయో వృద్ధులు, దివ్యాంగులు ఇళ్ల వద్ద ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నామినేషన్ల ఉపసంహరణ తరువాత ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులకు ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల లిస్ట్ అందజేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, ఆర్డీఓలు వాసుచంద్ర, శ్రీనివాస్‌రావు, డీపీఓ జయసుధ, ఎన్నికల విభాగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ



రెగొండి పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ జయసుధ

పెద్దేముల్: పంచాయతీ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని డీపీఓ డాక్టర్ జయసుధ సూచించారు. బుధవారం మండలంలోని రెగొండి, చైతన్య నగర్ గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పంచాయతీ సెక్రటరీలు నరేష్, నాగరాణిని అడిగి తెలుసుకున్నారు. మురుగు కాలువలు, తాగునీటి సరఫరాను పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కరించాలని సూచించారు. కొంత మంది కార్యదర్శులు విధులకు సక్రమంగా రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయని, ఇక నుంచి పద్ధతి మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ఎంపీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు

- మరోసారి బీజేపీకి అధికారం ఇస్తే రాజ్యాంగం మార్చే కుట్ర
- తలకొండపల్లి రోడ్‌షోలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

తలకొండపల్లి: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని లోక్‌సభ ఎన్నికల్లో తరిమికొట్టాలని నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలో జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షో పాల్గొన్న ఆర్ఎస్‌పీ మాట్లాడుతూ.. అబద్ధాలు చెప్పే కాంగ్రెస్, రాజ్యాంగాన్ని మార్చుతానంటున్న బీజేపీ మాటలు నమ్మవద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. కారుగుర్తుకు ఓటు వేసి తనను పార్లమెంట్‌కు పంపించాలన్నారు. మాజీ సర్పంచ్‌లు లలితాజ్యోతయ్య, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

ఓట్ ఫ్రమ్ హోమ్

- వయోవృద్ధులు, దివ్యాంగులకు వెసులుబాటు
- జిల్లా సంక్షేమాధికారి పద్మజ రమణ



ఓటరు అవగాహన ర్యాలీలో అధికారులు, ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం రూరల్: దివ్యాంగులు, వయోవృద్ధులు ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేసిందని జిల్లా సంక్షేమాధికారి పద్మజ రమణ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు బుధవారం ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్తు కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పద్మజరమణ మాట్లాడుతూ.. దివ్యాంగులకు, 85 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులకు ఇంటి వద్దే ఓటువేసే వసతి కల్పించామన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగుల కోసం ర్యాంపులు, ట్రైసైకిల్స్ అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ అనిత, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ క్రాంతి, సీడీపీఓ శాంతిశ్రీ, సూపర్‌వైజర్లు సత్తమ్మ, తులసి, కల్పన, అరుణ, పల్లవి, సరళ, టీచర్లు పాల్గొన్నారు.

ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్



రథోత్సవంలో క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ శ్రేణులు

భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

యాచారం: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఐదునెలల కాలానికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ విమర్శించారు. యాచారం మండల పరిధి నల్లవెల్లిలోని శ్రీ బొగ్గుల గట్టు సీతారామచంద్రస్వామి రథోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు హాజరైన క్యామ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ... అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఐదు నెలలుగా కాలయాపన తప్ప చేసిందేమీ లేదన్నారు. పల్లెల్లో బీజేపీని నమ్మే పరిస్థితి లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి జరిగిందన్నారు. కారు గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. కాగా రథోత్సవంలో యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భాషా, నాయకులు యాదయ్య, రాములు, లక్ష్మీపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘గుక్కెడు’ మహాప్రభో

దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది.. ప్రపంచ దేశాలకు ధీటుగా నిలుస్తోంది.. మనమే అందరికీ ఆదర్శం.. వేదికలెక్కిన ప్రతి సారీ పాలకులు, నాయకులు చెప్పే మాటలివే.. కానీ నేటికీ గుక్కెడు మంచినీటి కోసం చిన్నపాటి యుద్ధాలే చేయాల్సి వస్తోంది.. కిలోమీటర్లు నడిచి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తోంది.. ఇందుకు నిదర్శనం పెద్దేముల్ మండలం రాంసింగ్ తండానే..



పొలం వద్ద తాగునీరు పట్టుకుంటున్న రాంసింగ్‌తండా మహిళలు

తాగునీటి కోసం రాంసింగ్ తండా వాసుల పాట్లు

- మూడునెలలుగా అవస్థలు
- వ్యవసాయ బోర్లే దిక్కు
- కరెంటు లేకపోతే కర్ణాటక రాష్ట్రం నుంచి..
- మూడు రోజులకు ఒక్కసారి మిషన్ భగీరథ నీరు
- తండా వైపు కన్నెత్తి చూడని అధికారులు

పెద్దేముల్: మండల కేంద్రానికి రాంసింగ్ తండా 15 కిలో మీటర్ల దూరంలో, కర్ణాటక రాష్ట్రానికి అర కిలో మీటర్ దూరంలో ఉంటుంది. తండాలో 300ల జనాభా ఉంది. మూడు నెలలుగా గిరిజనులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. ప్రజల అవసరాలకు సరిపడా తాగునీరు సరఫరా చేయడంలో ఇటు ప్రభుత్వం, అటు అధికారులు పూర్తిగా విఫలమువుతున్నారు. దీంతో గొంతు తడుపుకోవడానికి వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రస్తుతం మూడు రోజులకు ఒక్కసారి మిషన్ భగీరథ నీరు వస్తోందని, తమ అవసరాలకు ఏ మాత్రం సరిపోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అర కిలోమీటర్ దూరంలోని వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని తెలిపారు. బోర్లలో నీరు తక్కువగా వస్తుండటంతో రైతులు తమను పొలాల వద్దకు రానివ్వడం లేదని వాపోయారు. పొలాల వద్ద కరెంటు లేని సమయంలో మరో అర కిలోమీటర్ నడిచి కర్ణాటక సరిహద్దు నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నామని చెప్పారు.

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

తండాలో నెలకొన్న తాగునీటి సమస్యను అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలుగా పొలాల నుంచి నీరు తెచ్చుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండొద్దని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా తమ గ్రామ సమస్య పరిష్కారం కావడం లేదని వాపోయారు. పంచాయతీ కార్యదర్శి తండా వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని తెలిపారు. మిషన్ భగీరథ నీరు మూడు రోజులకు ఒక్కసారి వస్తోందని, ట్యాంకుల్లో పురుగులు ఉన్నా శుభ్రం చేయడం లేదని, ఈ విషయాన్ని అధికారులకు విన్నవించినా వారికి పట్టడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు తండాలో నెలకొన్న నీటి సమస్యను తక్షణం పరిష్కరించాలని మహిళలు కోరారు.

కాలినడకే శరణ్యం

గ్రామానికి బస్సు సౌకర్యం కూడా లేదు. మండలానికి, ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేయాలంటే సుమారు రెండు కిలో మీటర్ల నడవాల్సిందే.. నిత్యావసర సరుకులు కొనాలన్నా, వైద్యం చేయించుకోవాలన్నా కర్ణాటక రాష్ట్రం కుంచారం, షాదీపూర్ గ్రామాలే దిక్కని తెలిపారు. తండాలో రెండు బోర్లు ఉన్నా చుక్క నీరు లేదు. తాగునీటి ట్యాంకులో పురుగులు ఉన్నా శుభ్రం చేయడం లేదు. ఆ నీరు తాగితే రోగాలు తప్పవని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంచి నీటి ట్యాంకును శుద్ధి చేసిన దాఖలాలు లేవని తెలిపారు. మిషన్ భగీరథ నీళ్లు మాకొద్దని తండావాసులు అంటున్నారు.



ఎండిన బోరును చూపుతున్న తండా వాసులు

పట్టించుకునే నాథులే లేరు



అనుబంధ గ్రామాలంటే మండల అధికారులకు చులకన. వేసవి కాలం ప్రారంభమై మూడు నెలలు దాటినా గ్రామంలో నీటి సమస్య గురించి పట్టించుకున్న నాథులే లేరు. అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదు. పంచాయతీ కార్యదర్శులు తండాకు రావడం లేదు.

– మోహన్ నాయక్, రాంసింగ్ తండా

మా బాధలు ఎవరికీ పట్టవు



తండాలో మూడు నెలలుగా నీటి సమస్య ఉంది. నిత్యం పొలాల నుంచి నీరు తెచ్చుకుంటున్నాం. మా బాధలు ఎవరికీ పట్టడం లేదు. రైతులు పొలాల వద్దకు రావద్దంటున్నారు. ఏం చేయాలో తోచడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి తండాలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– అన్ని బాయి, రాంసింగ్‌తండా

సమస్య లేకుండా చూస్తాం



రాంసింగ్ తండాలో నీటి సమస్య ఉన్న విషయం మా దృష్టికి రాలేదు. మిషన్ భగీరథ నీరు రావడం లేదని, ట్యాంకులో పురుగులు ఉన్నట్లు తండా ప్రజలు బుధవారం ఫోన్ ద్వారా తెలిపారు. పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వెంటనే నీటి సమస్యను పరిష్కరిస్తాం, ట్యాంకును శుభ్రం చేయిస్తాం.

– హకీల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పెద్దేముల్ మండలం

క్లుప్తంగా

బీఎంపీ అభ్యర్థిగా నామినేషన్



నామినేషన్ వేస్తున్న బీఎంపీ అభ్యర్థి

అనంతగిరి: బహుజన్ ముక్తి పార్టీ(బీఎంపీ) చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా పాత్లావత్ గోవింద్‌నాయక్ బుధవారం నామినేషన్ వేశారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు దాస్ రామ్‌నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్, ముక్తి మోర్చా అధ్యక్షుడు ప్రభాకర్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు పాత్లావత్ గట్యానాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నేనావత్ హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అనంతగిరి: వికారాబాద్ పట్టణ పరిధిలోని కొత్తగడి గ్రామ పరిధిలో బుధవారం అనుమానాస్పదంగా ఓ గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమయ్యిందని సీఐ నాగరాజు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించగా మృతుడు 40–45 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటుందని, యాష్ కలర్ షర్ట్, క్రీమ్ కలర్ ప్యాంట్ కలిగి ఉన్నాడని తెలిపారు. ఎవరైనా శవాన్ని గుర్తిస్తే ఫోన్ నంబర్‌ను 8712670030 సంప్రదించాలని సూచించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాలికపై లైంగిక దాడి

- గర్భందాల్చిన పదోతరగతి విద్యార్థిని
- పోలీసుల అదుపులో యువకుడు

బషీరాబాద్: బాలికపై లైగింక దాడికి పాల్పడిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(16) ఇటీవల పదోతరగతి పూర్తి చేసుకుంది. అదే గ్రామానికి చెందిన కర్రె నరేష్ (24) ఆటో డ్రైవర్ బాలికపై కన్నేశాడు. ఈ క్రమంలో రోజు పాఠశాల ఎదుట ప్రయాణికులను ఎక్కించుకునేందుకు నిత్యం ఆటోను నిలిపేవాడు. కాగా, పాఠశాలకు వచ్చే బాధిత బాలికకు ప్రేమపేరుతో మాయమాటలు చెబుతూ పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాలిక గర్భందాల్చింది. బాలిక తీరుపై అనుమానం వచ్చిన తల్లిదండ్రులు ప్రశ్నించగా అసలు విషయం చెప్పింది. తన కూతురుకు జరిగిన అన్యాయంపై తల్లిదండ్రులు మూడు రోజుల కిందట గ్రామంలో పంచాయితీ పెట్టారు. అక్కడ న్యాయం జరగక పోవడంతో బుధవారం కూతురిని వెంట పెట్టుకొని బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేశ్ కుమార్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


కొందుర్గు: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం చెందిన సంఘటన బుధవారం రాత్రి జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనంపల్లి గ్రామానికి చెందిన వనం వెంకటయ్య(64) లాల్‌పహాడ్‌లో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య అంజమ్మ, కుమారులు అంజయ్య, జంగయ్య ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సక్రమ్ తెలిపారు.

బహుదూరపు బాటసారి

- పాలమూరు గొర్రెల కాపరులు..
- ఏడాదిలో 8నెలలు ఆయా జిల్లాల్లోనే జీవం
- గొర్రెలకు మేత, నీటి కోసం ఇక్కట్లు
- కులవృత్తిని వదిలిపెట్టని పరిస్థితి



బంట్వారం శివారులో పాలమూరు గొర్రెల కాపారుల ప్రయాణం



రోడ్డు పక్కన మేత మేస్తున్న గొర్రెలు

బంట్వారం: పాలమూరు గొర్రెల కాపరులను బహుదూరపు బాటసారులుగా చెప్పవచ్చు. ఏడాదిలో 8 నెలల పాటు కురుమ ,గొల్లలు వివిధ జిల్లాల్లో గొర్రెల మందలతో మేతకోసం తిరుగుతూనే ఉంటారు. బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో సైతం నిత్యం కనిపిస్తూ ఉంటారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన గొర్రెల కాపరులు బృందాలుగా ఏర్పడి మందలతో బయలుదేరుతారు. ప్రతి ఏటా దీపావళి కాగానే ఇళ్లను వదిలి జీవాలతో సంచరిస్తుంటారు. పాలమూరు జిల్లా ఒకప్పుడు కరువు కాటకాలతో కొట్టుమిట్టాడుతుండేది. మూగజీవాలను బతికించుకునేందుకు అక్కడి గొర్రెల కాపారులు నానాతంటాలు పడేవారు. ఈ క్రమంలోనే వారు అప్పట్లోనే గొర్రెల మందలతో మేత కోసం సుదూర ప్రయాణం మొదలు పెట్టారు. నేటికి కూడా అదే పద్ధతిని అనుసరిస్తున్నారు. వేలాది గొర్రెలతో రోడ్డు మార్గంలో తిరుగుతూనే ఉంటారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కులవృత్తిని మాత్రం వదిలిపెట్టడం లేదని గర్వంగా చెబుతున్నారు.

తరచుగా ప్రమాదాలు

సుదూర ప్రయాణం రోడ్డు మార్గంలో సాగడంతో తరచుగా ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. వాహనాలు ఢీకొని జీవాలు చనిపోతున్నాయి. ఇన్సూరెన్స్ లేకపోవడంతో కాపారులు నష్టపోతున్నారు. సంబంధిత పశు సంవర్ధక శాఖ వైఫల్యంతో గొర్రెల కాపారులు తమ జీవాలకు ఇన్సూరెన్స్ చేయించడం లేదు.

నెలల తరబడి ఇంటికి దూరంగా..

నెలల తరబడి ఇంటికి దూరంగా ఉంటున్నారు. వందలాది కిలో మీటర్లు తిరుగుతూ ఎక్కడ చీకటి పడితే అక్కడే పొలాల్లో నిద్రిస్తున్నారు. సరియైన భోజనం, నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. జీవాలకు సైతం తాగు నీరు లభించడం లేదు. వాగులు, వంకలు అందుబాటులో ఉంటేనే నీరు తాగిస్తున్నారు. జూన్‌లో వచ్చే మృగశిర కార్తె వరకు బయటనే కాలం గడుపుతారు. వర్షాలు మొదలు కాగానే మెల్లగా మందలతో పాలమూరుకు తిరుగు పయనమవుతారు.

పొలాల్లో మందలు వేస్తూ..

రాత్రి వేళ పొలాల్లో మందలు వేస్తే రైతులు వెయ్యి రూపాయలు ఇస్తున్నారు. బియ్యం ఇతర నిత్యావసర సరుకులు అందజేస్తున్నారు. వీటితోనే కాపారులు కాలం గడుపుతున్నారు. పొలాల్లోనే వంట చేసుకుంటున్నారు. తెల్లవారగానే భోజనం సిద్ధం చేసుకుని సద్దిమూట, నీటి డబ్బాలతో మళ్లీ గొర్రెల మందతో ముందుకు సాగుతున్నారు. గొర్రెల ఎరువు పొలాలకు చాలా బలం కావడంతో రైతులు మరీ పోటీ పడి రాత్రి వేళ మందలు వేసుకుంటున్నారు.

ఇదే వృత్తిని నమ్ముకున్నాం



ఇదే వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాం. 8 నెలల పాటు బయట ప్రపంచానికి దూరంగా ఉంటాం. రెండు నెలలకు ఒకసారి ఇంటికి వెళ్లి వస్తాం. ఒక్కో మందకు నలుగురు కాపాలగా ఉంటారు. మెదక్, కరీంనగర్ ప్రాంతాల్లో కూడా తిరుగుతాం. వర్షాకాలం వరకు బయటనే ఉంటాం. గొర్రెల కాపరులను ప్రభుత్వం పట్టించుకోవాలి. సీజనల్‌గా జీవాలకు వైద్యం కూడా అందడం లేదు.

– ఆనందం, గొర్రెల కాపరి నారాయణపేట

ఇన్సూరెన్స్ చేస్తే మేలు..



ఇనూరెన్స్ లేకపోవడంతో నష్టపోతున్నాం. రోడ్డు పొడువునా చాలా దూరం వెళ్తుంటాం. కొన్నిసార్లు లారీలు ఇతర వాహనాలు గొర్రెల మందను గుద్దేసి పోతాయి. ఎవరూ పట్టించుకోరు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. కులవృత్తి కావడంతో వదిలిపెట్టడం లేదు. ప్రభుత్వం గొర్రెల కాపారులను ఆదుకోవాలి.

– ఐలయ్య , గొర్రెల కాపారి

గోదాంలోని సామగ్రి తరలింపు

సాక్షి ఎఫెక్ట్..

పెద్దేముల్: 'కోటపల్లి సామగ్రి దొంగల పాలు' అనే శీర్షికతో బుధవారం సాక్షి జిల్లా ఎడిషన్‌లో ప్రచురించిన వార్తకు ఇరిగేషన్ అధికారులు స్పందించారు. పెద్దేముల్ మండల కోటపల్లి గోదాంలో ఉన్న విలువైన సామగ్రిని గతంలో తాండూరు సబ్ డివిజన్ కార్యాలయానికి పంపించడం జరిగిందని, ఇంకా షెడ్ రేకులు, ఓ మిల్లర్‌ను కూడా త్వరలో పంపించడం జరుగుతుందని పెద్దేముల్ మండల కోటపల్లి ప్రాజెక్టు ఏఈ నవీన్ తెలియచేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన సామగ్రిని దొంగతనం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోటపల్లి ప్రాజెక్టు అభివృద్ధికి రైతులు సహకరించాలని ఏఈ నవీన్ తెలియచేశారు.

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరేస్తాం

ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి



మాట్లాడుతున్న మాధవరెడ్డి, నాయకులు

బంట్వారం: చేవెళ్ల పార్లమెంట్ గడ్డపై కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో ఆయన ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు విశ్వజిత్‌రెడ్డి తదితరులతో కలిసి పార్టీ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొండా విశ్వేశ్వర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు కృష్ణాయాదవ్, మహిళా మోర్చా అధ్యక్షుడు శిరీష, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు చరణ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కృష్ణ, నాయకులు రమేశ్‌కుమార్, శివకుమార్, బద్రేశ్వర్, జగదీశ్వర్, మహేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ మహిళ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కేస్లీ తండాకు చెందిన రమావత్ పెంటి(55) కుటుంబ సభ్యులతో కలిసి సంతోషనగర్‌లో నివాసం ఉంటున్నారు. మాల్ కేంద్రంలోని ఓ బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారు నగలను విడిపించుకోవడానికి బుధవారం తన చిన్న కుమారుడు అమర్‌సింగ్‌తో కలిసి ఆటోలో మాల్‌కు వస్తున్నారు. అదే క్రమంలో మాల్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఓ గుర్తు తెలియని కారు తమ్మలోనిగూడ గేట్ వద్ద ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటనలో పెంటికి తీవ్ర గాయాలై అక్కడే మృతి చెందగా, అమర్‌సింగ్‌కు సైతం తీవ్రగాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి



గొంగుపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పూడూరు: కాంగ్రెస్ పాలనలోనే మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందాయని పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గొంగుపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమిలేదన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి, కేసీఆర్ కుటుంబం మాత్రం లక్షల కోట్లు సంపాదించుకున్నారని ఆరోపించారు. గత కాంగ్రెస్ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ల, ఉద్యోగాలు, ఏకకాలంలో రుణమాఫీ చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో ఉన్న చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, డీసీసీ కార్యదర్శి పెంటయ్య ,షకీల్,అజీంపటేల్, మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్, నాయకులు రవి, బాలమణి, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు ఓటేయండి

చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



ప్రచారంలో మాట్లాడుతున్న రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమాలకు తోడుగా కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరిగే అవకాశం ఉంటుందని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రచారంలో భాగంగా కార్నర్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటం వల్ల ప్రస్తుతం ఉచిత బస్సు సౌకర్యం, 5వందలకే గ్యాస్, ఉచిత విద్యుత్తు వంటివి అందుతున్నాయని అదే కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే నిరుపేద ప్రజల అభ్యున్నతికి మరిన్ని సంక్షేమ పథకాలు అమలు అయ్యేందుకు అస్కారం ఉంటుందన్నారు. ప్రజలందరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని వివరించారు. మత రాజకీయాలు చేసే బీజేపీ అభ్యర్థికి ఓటు వేస్తే పార్లమెంట్ పరిధిలో ఎటువంటి అభివృద్ధి జరగదని, ఎన్నికలప్పుడు నిరాధారమైన ఆరోపణలు చేయడం తప్ప ఆయన చేసేదేమిలేదన్నారు. నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రంజిత్‌రెడ్డిని మరొసారి ఎంపీగా చేసే బాధ్యతను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తీసుకోవాలని, ప్రజల అభివృద్ధి బాధ్యతను తాము తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు అంజనేయులు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, నాయకులు బాలముకుందం, కుమ్మరి స్వామి, శివరాములు, లాల్‌కృష్ణ, హరినాథ్‌రెడ్డి, నర్సింలు, సాయన్న, ఘణపూర్ శ్రీనివాస్, భాస్కర్, కొమ్ము శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఔటర్ సర్వీస్‌పై వ్యాన్ దగ్ధం

- నడిరోడ్డుపై చెలరేగిన మంటలు
- ట్యాంకర్ రావడంతో తప్పిన ప్రాణనష్టం



బొంగ్లూర్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో దగ్ధమవుతున్న వాహనం

ఇబ్రహీంపట్నం రూరల్: బొంగ్లూర్ ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డుపై ఓమిని వ్యాన్ దగ్ధమైంది. వాహనం కింది భాగం నుంచి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవర్ అప్రమత్తమై కారు లోంచి దూకి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మొట్లంపల్లి గ్రామానికి చెందిన కురువ మనోహర్ స్థానికంగా మన్నెగూడలో నివాసం ఉంటూ పండ్ల వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ మేరకు ఆయనకున్న ఓమిని వాహనంలో పండ్లు వేసుకొస్తారు. ఇదే క్రమంలో బుధవారం మన్నెగూడ నుంచి ఇబ్రహీంపట్నం వైపు వెళ్తుండగా బొంగ్లూర్ ఔటర్ సర్కిల్ సర్వీర్ రోడ్డు వద్దకు రాగానే కారులో మంటలు చెలరేగాయి. గమనించిన మనోహర్ వెంటనే కారు లోంచి బయటికి దూకేశారు. మంటలు పెద్దగా వ్యాప్తి చెందడంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. వెనకాలే ట్యాంకర్ రావడంతో నీరు పోసి మంటలు ఆర్పారు. అంతలోనే ఫైరింజన్ వచ్చి మంటలు పూర్తిగా కట్టడి చేసింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

అనంతగిరి: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం వికారాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ మండలం సిద్దులూర్ గ్రామానికి చెందిన ఉమ్మెంతల గోపాల్ (46)హైదరాబాద్ శేరిలింగంపల్లిలో ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం ఉ.6గంటలకు తన విధులు ముగించుకుని లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో వికారాబాద్ వచ్చేందుకు రైలు ఎక్కాడు. కాగా, రైలులో ప్రయాణిస్తూ వికారాబాద్–చిట్టిగడ్డ రైల్వేస్టేషన్ మధ్య ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. స్థానికులు గమనించి విషయం రైల్వే అధికారులకు చెప్పడంతో ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించగా మృతుడి ఆచూకీ గుర్తించారు. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



పూలగుత్తులతో ఆకర్షిస్తున్న చెట్టు

నిలువెల్లా పువ్వులే!

వేసవికాలం రాగానే చెట్ల ఆకులు రాలిపోయి.. ఎండినచెట్లే దర్శనమిస్తాయి. కాగా, ఒక్క కాగితం పూలచెట్టు మాత్రమే నిలువెల్లా పూలతో నిండి ఉంటుంది. ఇది ప్రకృతి సిద్ధం.. ప్రస్తుతం ఎండలు మండుతున్న తరుణంలో ప్రయాణికులను ఆకర్షిస్తూ రా.. రమ్మని పిలుచుకొని నీడనిస్తూ సేద తీరుస్తున్నాయి.

– బొంరాస్‌పేట

కంకర వేశారు.. బీటీ మరిచారు

రెండేళ్ల క్రితం బీటీరోడ్డు పనులకు అప్పటి మంత్రులు శంకుస్థాపన చేశారు. ఏడాది క్రితం పనులు మొదలు పెట్టారు. ఎన్నికల ముందు మరింత హడావుడి చేసి వంద మీటర్ల దూరం బీటీ రోడ్డు వేశారు. ఆ తరువాత పూర్తిగా వదిలేశారు. ఇది చిలుకూరు–మొయినాబాద్ బీటీ రోడ్డు పనుల దుస్థితి.

- అసంపూర్తిగా చిలుకూరు–మొయినాబాద్ రోడ్డు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కంకర పోసి వదిలేసిన చిలుకూరు–మొయినాబాద్ రోడ్డు

మొయినాబాద్: మండల పరిధిలోని చిలుకూరు నుంచి వయా మొయినాబాద్ మీదుగా సురంగల్ వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. 2022 మార్చి 13న అప్పటి మంత్రులు బీటీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత ఏడాదికి కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను మొదలు పెట్టారు. సురంగల్ నుంచి మొయినాబాద్ వరకు కంకర పోసి, బీటీరోడ్డు వేయడానికి ఆరు నెలల సమయం పట్టింది. కానీ మొయినాబాద్ నుంచి చిలుకూరు వరకు మాత్రం అప్పట్లో పనులు మొదలు పెట్టలేదు. ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చింది.


ఎన్నికల ముందు హడావుడి..

చిలుకూరు నుంచి మొయినాబాద్ వరకు రోడ్డు పనులను ఎన్నికల ముందు హడావుడిగా మొదలు పెట్టారు. ఎన్నికలకు పదిరోజుల ముందు నుంచి చిలుకూరు నుంచి కొంత దూరం వరకు రోడ్డుపై కంకర వేశారు. ఎన్నికలకు ఒక రోజు ముందు వంద మీటర్ల దూరం బీటీరోడ్డు సైతం వేశారు. ఆ తరువాత రోడ్డు పనులను పూర్తిగా నిలిపేశారు. ఎన్నికలు పూర్తయి ఐదు నెలల కావొస్తోంది. ప్రస్తుతం మళ్లీ లోక్‌సభ ఎన్నికలు వస్తున్నాయి. అయినా కాంట్రాక్టర్ మాత్రం పనులు చేపట్టడం లేదు. ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే బీఆర్ఎస్ నేతలు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి ఎన్నికల ముందు పనులు చేయించారని.. ఓటింగ్‌కు ఒక రోజు ముందు కొంత దూరం బీటీరోడ్డు వేయించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల తరువాత పనులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. రోడ్డు నిర్మాణంలో స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు చిత్తశుద్ధిలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

నాణ్యతా లోపం

చిలుకూరు నుంచి సురంగల్ వరకు మొత్తం 6 కిలోమీటర్ల దూరం బీటీ రోడ్డు వేయాల్సి ఉండగా మొదటగా కాంట్రాక్టర్ సురంగల్ నుంచి పనులు మొదలుపెట్టారు. సురంగల్ నుంచి మొయినాబాద్ వరకు సుమారు 3.5 కిలోమీటర్ల దూరం బీటీరోడ్డు వేశారు. కానీ అది నాణ్యతాలోపంతో వేయడంతో నెల రోజులకే పెచ్చులు లేసింది. సురంగల్ పెద్దచెరువు సమీపంలో వంద మీటర్ల దూరం బీటీరోడ్డు వేయకుండా వదిలేశారు. ఇక చిలుకూరు నుంచి మొయినాబాద్ వరకు సుమారు 2.5 కిలోమీటర్ల దూరం బీటీరోడ్డు వేయాల్సి ఉండగా కిలోమీటర్‌కుపైగా దూరం మట్టి పోసి వదిలేశారు. మరో కిలోమీటర్ దూరం కంకర పోశారు. కేవలం వంద మీటర్ల దూరం మాత్రం బీటీరోడ్డు వేశారు. రోడ్డుపై కంకర పోసి వదిలేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ములేస్తోంది.


ఇబ్బంది పడుతున్నాం



చిలుకూరు నుంచి వయా మొయినాబాద్ మీదుగా సురంగల్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన స్థానిక ఎమ్మెల్యే, ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడంతో పనులు జరగడం లేదు. ఎన్నికలకు ఒకరోజు ముందు హడావుడిగా వంద మీటర్ల దూరం బీటీరోడ్డు వేశారు. ఆ తరువాత పనులే చేయడం లేదు. ఈ రోడ్డుపై వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– గరుగు రాజు, చిలుకూరు, మొయినాబాద్

త్వరలోనే పనులు చేయిస్తాం



చిలుకూరు–సురంగల్ రోడ్డు పనులు చేయడంలో కాంట్రాక్టర్ కొంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఇప్పటికే కాంట్రాక్టర్‌కు చాలా సార్లు చెప్పాం. సురంగల్ నుంచి మొయినాబాద్ వరకు వేసిన బీటీరోడ్డు నాణ్యత లేదని గుర్తించాం. అందుకే ఇప్పటి వరకు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదు. మిగతా పనులు కూడా త్వరలోనే పూర్తి చేయిస్తాం.

– విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డీఈ, మొయినాబాద్